గాంధీజీ సత్యశోధన

4

బంద్ 1999

గత సంచిక తరువాయి

"అయిందిగానీ - ఆఫీసు కెళ్ళడానికి వీల్లేదని ఇప్పుడే హోమ్ మినిస్టర్ వార్నింగ్ ఇచ్చి వెళ్ళాడు కదా!"అన్నాడు గోపాల్రావ్ సణుగుతూ.

"ఓరె ప్రెసిడెంట్! జీనాసై హైక్యారే తేరేకో! రేపు తొమ్మిది గంటలకు రెండు లారీలు తెస్తున్నాం! అందరూ లారీలు ఎక్కకపోయిన్రో బే ఇజ్జతవుదది — సమజైందా?''

ఇంక లాభం లేదని రెడ్డి కల్పించుకున్నాడు.

''ఇదిగో చూడండి నర్సింహగారూ! మీరిలా జబర్దస్త్ చేయడం ఏమీ బాగుండలేదు — మేము ఆఫీసులకు వెళ్ళినా ప్రయోజనం వుండదు. ఎందు కంటే గవర్నమెంటే అన్ని ఆఫీసులూ మూసే స్తోంది—''

''అదంతా మాకు తెల్వదు భాయ్! మా లీడర్ సాబ్ చెప్పిండు. ఆఫీసులు ఖుల్ల ఉండినా, లేకున్నా గానీ మీరు ఆఫీస్‌ల ముందు నిలబడాలె! లేకుంటే మీ భార్యా బిడ్డలను లోపట జేస్తాం! ఏం జెప్తున్న?''

''సరే'' అన్నాడు గోపాల్రావ్ నీరసంగా.

మరుక్షణంలో వాన్ వెళ్ళిపోయింది.

అందరం ఒకరి మొఖాలొకరు చూసుకున్నాం.

''ఇప్పుడేమిటి చేయడం?'' అడిగాడు రంగారెడ్డి.

''ఈ గుండాలతో గొడవెందుగ్గానీ మనం ఆఫీస్‌ల కెళ్ళడమే మంచిది—'' అన్నాడు శాయిరావ్.

''కాని స్టేట్ గవర్నమెంట్ మనకి ఆఫీసులకు రాకుండా వుండడానికి కదా అయిదు వందలు ఇచ్చింది?''

''అయితే ఓ పని చేద్దాం! అందరం ఆఫీస్‌లకు వెళ్దాం గానీ కాంటీన్ దగ్గరే కూర్చుని మధ్యాహ్నానికి తిరిగి వచ్చేద్దాం!'' అన్నాడు గోపాల్రావ్.

ఆ అయిడియా అందరికీ నచ్చింది.

''ఒకే బులెట్‌కి రెండు పిట్టలు'' అన్నాడు జనార్దన్.

ఉదయం ఆఫీస్ కెళ్ళడానికి అందరం రెడీ అయి గుండాల స్పెషల్ లారీల కోసం ఎదుర్చూస్తూ వేదిక దగ్గర కూర్చున్నాం. అయితే లారీలకు బదులుగా ఇంకో పెద్ద వాన్ వచ్చింది. అందులో నుంచి ఓ పాతిక మంది గూండాలు, తుపాకులు, బాంబులు తీసుకుని దిగారు. వాళ్ళతో పాటు రాష్ట్ర హోమ్ మంత్రి దండలతో దిగాడు.

''ఏయ్! ఇయాళ బందని తెల్సి కూడా మళ్ళీ ఆఫీస్ కెళ్ళడానికి ఈడెందుకు జమయిన్రు బే? తలగిట్ట తిరుగుతున్నదా ఏం?'' అడిగాడు మినిస్టరు.

గోపాల్రావ్ లేచి వినయంగా నిలబడ్డాడు.

''అది కాదండీ! రాత్రి ఇంకెవరో గూండాలు వచ్చి ఆఫీస్‌ల కెళ్ళకపోతే మా ఇళ్ళ మీద ఎటాక్ చేస్తామని చెప్పాడు — అందుకని...''

''అందుకని మా దగ్గర అయిదొందలు తీస్కొని మళ్ళీ ఆ పార్టీ గూండాలు చెప్పినట్టు చేస్తారు? నీయవ్వ మీకేమయినా షరమున్నదా? తినేది స్టేట్ గవర్నమెంట్ ఉప్పు — పలికేది కేంద్ర ప్రభుత్వం పలుకురా? ఇగో ఇప్పుడే జెప్తున్నా ఇనండ్రి! ఒక్కడు గూడా ఆఫీసులకు పోయిండో ఈ కాలనీ ఖబరస్తాన్ అవుతది! ఏం చెప్తున్న?''

అందరం భయంగా తల ఊపాం! వాళ్ళు మళ్ళీ వాన్‌లో ఎక్కారు.

''ఇగో — నేను గంటకోసారి ఈడకొచ్చి మీ అందరి హాజరు తీసుకుంటా! సాయంత్రం వరకూ ఇట్లా గంట గంటకూ చెకింగ్ చేస్తనే వుంట! సమజయిందా?'' అడిగాడు హోమ్ మినిస్టర్.

అందరం తలూపాము. అందరి మొఖాలు పాలిపోయి వున్నాయి.

వాన్ వెళ్ళిపోయింది.

దూరంగా మెయిన్ రోడ్ నుంచి లౌడ్ స్పీకర్ అమర్చిన పోలీసు వాన్ బిగ్గరగా హెచ్చరికలు చేసు కుంటూ వెళ్తోంది.

''ప్రజలకు పోలీసు హెచ్చరిక! ఇవాళ ప్రభుత్వ బంద్ జరుగుతున్నది కనుక రాత్రి పన్నెండు గంటల వరకు ఇళ్ళ నుంచి బయటకు రావడం నిషేధించడ మైనది.

ఈ నిషేధాన్ని ఉల్లఘించినవారిని నిర్దాక్షిణ్యంగా చంపు టకు మాకు అధికారం వుందని తెలుసుకో ప్రార్థన''

మా గుండెలు వేగంగా కొట్టుకోసాగాయ్. అందరి మొఖాల్లోనూ భయం కనిపిస్తూం దిప్పుడు.

ఆ వాన్ దూరం వెళ్లిపోగానే రెండు లారీలో కేంద్రం లోని అధికార పార్టీ జెండాలతో రాష్ట్ర ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ వచ్చేశారు.

''ఛలో ఎక్కండి'' అన్నారు వాళ్లు లారీలు పట్టుకుని మా వేపు వస్తూ.

''కానీ ఆఫీస్ కెళ్తే చంపేస్తామని రాష్ట్రంలో అధికార పార్టీ వాళ్లన్నారు కదా! ఎవరి మాట వినాలి మేము?'' అన్నాడు రంగారెడ్డి ధైర్యంగా.

వాళ్లంతా రంగారెడ్డి వేపు చూశారు.

''ఎవరి మాట వినాలా? ఎవడి చేతిలో కత్తి వుంటే ఆడి మాట వినాలి! తెల్సిందా?'' ఒకడు కత్తి తీశాడు బయటకు.

ఇంక గత్యంతరం లేక లారీలు ఎక్కసాగాము.

కాలనీలోని ఆడాళ్లూ పిల్లలూ అందరూ భోరున ఏడుస్తూ లారీల చుట్టూ నిలబడ్డారు.

''ఏవండీ! మన పెద్దాడిని టెన్త్ అయ్యాక ఏం చది వించమంటారు?'' అంది మా ఆవిడ కన్నీరు తుడుచు కుంటూ.

''వాడిని నేనుంటే ఇంజనీరింగ్ చదివిద్దామను కున్నానే! కానీ నీకు అంత పెద్ద చదువు చదివించడం కష్టమవుతుందో ఏమో! పాలిటెక్నిక్‌లో చేర్పించు'' చెప్పాను.

''ఏమండీ! మీరు పోతే గవర్నమెంట్ మా కెంతి స్తుంది?'' అడిగింది ఒకామె తన భర్తను.

''యాభై వేలు ఇస్తారనుకుంటానే! దాంతో ఏ ఆస్ట్రేలియానో, సింగపూర్‌కో వలసవెళ్లిపో! పిల్లలయినా బాగుపడతారు'' చెప్పాడతను.

కాసేపు అప్పగింతలూ ఏడుపులూ అయాక మా లారీలు బయల్దేరాయ్.

రోడ్లన్నీ ఖాళీగా వున్నాయ్ గానీ చాలాచోట్ల రోడ్డుకి అడ్డంగా ముళ్లకంచెలు వేసి వున్నాయ్. వీటిని ఓ క్రేన్ తొలగిస్తుంటే వెనుక మా లారీలు నడవసాగినయ్. కోఠీ చౌరస్తా దగ్గర కొచ్చేసరికి పోలీసులు తుపాకులు పట్టుకుని అడ్డంగా నిలబడ్డారు.

''వెంటనే లారీలు వెనక్కు తిప్పి ఎవరిళ్లకు వాళ్లు వెళ్లిపోండి! లేకపోతే కాల్పులు జరపాల్సి వస్తుంది'' అంటూ తుపాకులు ఎక్కుపెట్టారు వాళ్లు.

మా లారీలోని గూండాలు వాళ్ల మీదకు బాంబులు

యర్రంశెట్టి శాయి

విసిరారు. వాళ్లు పారిపోతూనే తుపాకీలు కాల్చారు. భయంకరమయిన శబ్దాలకు భయపడిపోయి మేము లారీలో తలవంచుకుని వణుకుతూ కూర్చుండి పోయాము.

అరగంట సేపు యుద్ధం జరిగింది.

పోలీసులు మామూలుగానే పారిపోయారు. గూండా లలో అరడజను మంది బులెట్ దెబ్బలతో వచ్చి కింద పడి వున్నారు. మా లారీలు మళ్లా బయల్దేరినయ్. ఆబిడ్స్ వెళ్లే సరికి ఇంకా చాలా మంది పోలీసులు తుపాకులతో చుట్టుముట్టేశారు. గూండాలు బాంబులు విసిరారు గానీ అవి పేలలేదు. వాళ్లందరినీ పోలీస్ వాన్‌లో ఎక్కించేశారు.

"నీయమ్మ! ఈ బాంబులు తయారుచేసిన కంట్రాక్టర్‌గాడు మనల్ని మోసం చేశాడు" అన్నాడు గూండా.

"ఎవరు మీరంతా?" అడిగాడు పోలీస్ అధికారి మమ్మల్ని.

"మేము ప్రభుత్వోద్యోగులం సార్! ఈ గూండాలు మమ్మల్ని బలవంతంగా ఇళ్లల్లోనుంచి బయటికీడ్చుకొచ్చి ఆఫీస్‌కి తీసుకెళ్తున్నారు."

"ఆల్‌రైట్! వెంటనే వెనక్కు తిరిగి ఇంటికి వెళ్లిపోండి! ఇంకొకసారి బయటెక్కడయినా కనిపించారో కాల్చి పారేస్తాం! జాగ్రత్త!" హెచ్చరించాడతను.

మేము ఈసురోమంటూ మళ్లీ మా కాలనీ వేపు బయల్దేరాం. దారిలో రోడ్ పక్కనే నిలబడి వున్న పెద్ద గూండా గుంపు కనిపించేసరికి మాకు భయంవేసి కొద్ది దూరంలోనే నిలబడిపోయాం.

"ఏయ్ దుకాణాలు ఖుల్లపెట్టాలని చెప్తే ఎందుకు బంద్ జేసిన్రుబే?" కొంతమంది వ్యాపారస్తుల్ని గద్దిస్తూ అడిగాడు గూండా నాయకుడు.

"తెరుస్తే షాపులు తగలబెడతామని అపోజిష వోళ్లు జెప్పిన్రు భాయ్! మేమేం జెయ్యాలి?"

"ఇగో! ఈ నకరాలు మన్లగ్గర నడవయ్! గిప్పుడు ఖుల్ల... జేస్తరా లేదా? ఒకటే మాట అడుగుతున్న!"

"చేస్తే వాండ్లొచ్చి దుకాణాలు తగలబెడతారు సార్" అతని కాళ్లమీద పడ్డారు వాళ్లు.

గూండా నాయకుడి కింక కోపం ఆగలేదు.

"అరేయ్! క్యా దేఖ్‌రైరే! జవాన్ దుకాణంకో" అరిచాడతను. మరుక్షణం షాపులన్నింటి లోపలకు పెట్రోల్ పోసి నిప్పంటించారు. పెద్ద ఎత్తున మంటలు లేచే సరికి మేము పరుగు మొదలుపెట్టాము. రెండు గంటలు ఆగకుండా నడుస్తేగానీ మాకాలనీ చేరుకోలేకపోయాను. అప్పటికే అంత దూరం నడవడం అలవాటులేకపోవడం వల్ల పాదాలు పుళ్లయిపోయాయి. దానికి తోడు భయంకరమయిన నొప్పులు!

ఇళ్లలోకెళ్లి రెండు రోజులు కదలకుండా మంచాల మీద పడి వుంటేగానీ తిరిగి తేరుకోలేమని మాకు అర్థమయిపోయింది.

తీరా కాలనీ చేరుకునేసరికి ఇంకో రెండు లారీల్లో వాటి పక్కనే తుపాకులతో నిలబడ్డ మరో గుంపు కనిపించారు.

కాలనీలో మా ఇళ్లన్నీ ధ్వంసం అయి వున్నాయ్. సామానంతా ఇంటి బయట తగలడుతూ కనిపించింది. ఆడాళ్లూ, పిల్లలూ అంతా బయటే నిలబడి ఏడుస్తున్నారు.

"ఏమిటి? ఏం జరిగింది?" అడిగాము ఆడాళ్లను.

"అందరూ ఇళ్లల్లోనే వుండాలని హోం మినిస్టరు చెప్పినా మీరు వినకుండా ఆఫీస్‌ల కెళ్లారని తెలిసి పోలీసులను తీసుకొచ్చి అంతా ధ్వంసం చేయించాడు దగ్గరుండి." మాకేం చేయాలో తెలీలేదు.

"ఏయ్ లారీ లెక్కండి" అంత వరకు మా వంక నిశ్శబ్దంగా చూస్తున్న గుంపులో నుంచి ఒకడు మాకు తుపాకీ గురిపెట్టి అరిచాడు.

"మళ్లీ మీరెవరు?" ఏడుపు ఆపుకుంటూ అడిగాడు రంగారెడ్డి.

"నీ యవ్వ! ఆఫీస్‌ల కెళ్లమని లారీ లెక్కిస్తే మళ్లా వెనక్కు తిరిగొస్తారా? సాలె! ఎక్కండి లారీ! లేకపోతే అందర్నీ పిట్టల్ని కాల్చినట్టు కాల్చి పారేస్తాం" అంటూ గాల్లోకి తుపాకి పేల్చాడు. యాదగిరికి పౌరుషంపొడుచుకొచ్చింది మళ్లీ.

"నీ యవ్వ బయటికెళ్తే పోలీసుల లాఠీ ఛార్జి! ఇండ్ల కొస్తే ఈ బాడుకవ్‌లు కాల్చి చంపుతామని బెదిరింపు ధూ నీయవ్వ జిందగీ! గింత బాడుకవ్ దేశం ప్రపంచంలో ఇంకేడ గూడ వుండదు ధూ... ధూ"

"ఏమిరోయ్ స్పీచ్ లిస్తున్నావ్? మంచిగ లారీ ఎక్కుతున్రా లేదా?" ఇంకో ఇద్దరు కత్తులు తీసుకుని మా మీదకొచ్చారు. పక్షవాతం వచ్చినట్టున్న కాళ్లను కూడదీసుకుంటూ అందరం మళ్లీ లారీ ఎక్కాము. ఈసారి లారీ ఎక్కువ దూరం వెళ్లకుండానే హోం మినిస్టర్ జీప్‌తో పాటు వస్తోన్న నాలుగు లారీల పార్టీ గుండాలు ఎదురు వచ్చి అటకాయించినయ్.

"లారీలనూ లోపటున్నోళ్లనూ అందరినీ జలాయించండి" అంటూ అరిచాడు హోం మినిస్టర్. అప్పటికే మా లారీ పక్కన బాంబులు ప్రేలడం మొదలయింది.

ఆ తరువాతేం జరిగిందో నాకు తెలీదు.

తిరిగి కళ్లు తెరిచేసరికి అందరం గవర్నమెంట్ హాస్పిటల్లో వరండాలో వరుసగా నేలమీద పడి వున్నాం. అందరికీ వళ్ళంతా బాండేజీలు!

వార్డ్ లోపల్నుంచీ టి.వి.లో వార్తలు వినబడుతున్నాయ్.

"నేడు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన బంద్ సంపూర్ణంగా విజయవంతం అయిందని రాష్ట్ర బంద్ శాఖా మంత్రి శ్రీ బందేశ్వర్‌రావ్‌గారు తెలియజేశారు. రాష్ట్ర ప్రజలంతా అమితమయిన ఆనందోత్సాహాలతో బంద్‌లో పాల్గొని ఇళ్లల్లోనుంచి బయటకు రాకుండా పూర్తి మద్దతు ఇచ్చినందుకు ముఖ్యమంత్రి వారికి తమ అభినందనలు తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో తెరచిన కొన్ని దుకాణాల మీద ముఖ్యమంత్రి బృందం అతి ధైర్య సాహసాలతో పోలీసుల సాయంతో దాడులు జరిపి తగలబెట్టారు. ముఖ్యమంత్రే స్వయంగా ఆరు కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలకు జ్యోతిని వెలిగించి నిప్పంటించినప్పుడు ఆయన పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున హర్షధ్వానాలు చేశారు. ఒక కేంద్ర ప్రభుత్వ కార్యాలయానికి నిప్పంటిస్తున్నప్పుడు ప్రతిఘటించిన కొంతమంది కేంద్ర సిబ్బందిని స్వయంగా ముఖ్యమంత్రే తమ మిషన్ గన్‌తో కాల్చి చంపారు. ఈ కాల్పుల్లో అయిదు వేల మంది మరణించగా ఎనిమిది వేల మంది గాయ

శాయితో ముఖాముఖి

ఎం. పుష్పచంద్ర, కె.ఆర్. కండ్రిక పోస్ట్, రైల్వే కోడూర్

ప్ర: మీకు 'నిర్భయ్ నగర్ కాలనీ' ప్రాయాలన్న ఆయిడియా ఎలా కలిగింది?

జ: ఆంధ్రప్రదేశ్ రాజధాని పౌరుడిని కాబట్టి!

రావుల సుభాష్ రెడ్డి, ఐ.డి.ఎ. జీడిమెట్ల

ప్ర: ఆడవారిని అత్తారింటికి పంపుతున్నాం అంటారు గాని మామగారింటికి పంపుతున్నాం అనరు. ఎందుకని?

జ: అక్కడ భరతం పట్టేది అత్తగారే కనుక.

ఎం.ఎస్.నివాస్, డోర్నకల్

ప్ర: శాయిజీ! మీరో పరమ బోరు పత్రిక పెట్టి నన్నో స్టాఫ్ రైటర్‌గా, గౌరవ సంపాదకులుగా నియమించవచ్చుగా?

జ: ప్రతిదానికీ రేట్లుంటాయ్

విజయశ్రీ, గోనెగండ్ల

ప్ర: మీ హ్యూమరాలజీ ఫెంటాస్టిక్! మీరు రచయిత కావడానికి ఎలాంటి కృషి చేశారు?

జ: డెయిలీ పేపర్స్‌లో ఉత్తరాలు చదివాను.

పి. జీవన్, చింతపల్లి

ప్ర: ఒంటరిగా వెళ్ళే కాలేజీ అమ్మాయిని మగాళ్ళు నలుగురయిదుగురుంటే ఏడిపిస్తారు. అలాగే నలుగు రైదుగురు అమ్మాయిలు వున్నప్పుడు ఒంటరిగా వెళ్ళే కుర్రాడిని ఏడిపిస్తారా?

జ: మిత్రమా - ఒంటరిగా ఓసారి నవజీవన్ ఉమన్స్ కాలేజీ ముందు గానీ, లేదా జంటనగరాల్లోని ఏ ఇతర కాలేజీ ముందుగానీ ఓసారి నడిచి చూడుము.

జి.వాసు, ఖమ్మం

ప్ర: పాఠకుల్లో మంచి ప్రేజ్ వున్న రచయిత కదా మీరు. ఎన్నికల్లో పోటీ చేయకూడదూ?

జ: రిగ్గింగ్ విద్యలో 'ప్రేజ్' వుండాలి కదా మనకు! అది లేకుండా ఎలా నిలబడతాం.

కాజ పానిత, ఏలూరు

ప్ర: పృథ్వియై శాశ్వతమైనది ఏది?

జ: సినిమా

ఎస్. నరేందర్ రెడ్డి, చెర్యాల

ప్ర: ప్రపంచం మొత్తం మీద అతి పెద్ద జోకర్ ఎవరండీ శాయిగారూ?

జ: అబ్బ పోదురూ! మరీ తెలీనట్లు - మొన్న ఎలక్షన్‌లో జనం చెప్పారుగా!

పోలోజు వెంకటాచారి, బోడుప్పల్

ప్ర: నవ్వుతూ బ్రతకాలిరా తమ్ముడూ అన్నాడో కవి! అది ఎంత మందికి సాధ్యమౌతుంది సార్?

జ: ప్రక్కవాళ్ళ జీవితాలు చూసే వాళ్ళందరికీ.

జె. శ్యాంసుందర్ రావ్, కేసముద్రం

ప్ర: మనసుకి కళ్ళుంటే?

జ: కొంపలు మునిగిపోతాయ్. మన మనసులోని సీక్రెట్స్ అన్నీ పక్కవాళ్ళు చూసేస్తారు.

పడ్డారు. రాష్ట్రం మొత్తం మీద పదహారు ప్రయాణీకుల రైళ్లను, ఆరవై గుడ్స్ రైళ్లనూ రాష్ట్ర పోలీసులు తగులబెట్టారు. ఇందులో రెండు రైళ్లను ప్రయాణీకులతో సహా తగలబెట్టినప్పుడు మంటలార్పడానికి ప్రయత్నించిన కేంద్ర రిజర్వ్ పోలీస్ దళాలతో, రాష్ట్ర పోలీస్ దళాలు రాత్రి పన్నెండు గంటల వరకు పోరాటం జరిపాయి. రాష్ట్ర కాబినెట్ మంత్రులందరూ విధ్వంస కాండలో పాల్గొని ముఖ్యమంత్రికి తమ పూర్తి సహకారం అందజేశారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన బంద్ పూర్తిగా విఫలమయిందని కేంద్రంలోని అధికార పార్టీ నాయకుడు శ్రీ బంద్‌జిత్ యాదవ్ ప్రకటించారు. తాము బంద్‌కు ముందు రోజే హైజాక్ చేసిన రెండు వందల రాష్ట్ర ఆర్టీసీ బస్‌లను బంద్ రోజు ప్రయాణీకుల సౌకర్యం కోసం తమ పార్టీ డ్రైవర్ల సాయంతో నడపగలిగామని రాత్రి పన్నెండింటి వరకూ నడిపిన తర్వాతనే వాటిని తగలబెట్టామని ఆయన తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన అనేక కార్యాలయాల భవనాలను ధ్వంసం చేసి తగులబెట్టినందుకు ఆయన కేంద్ర రిజర్వ్ పోలీస్‌ని అభినందించారు. తమ పార్టీ వలంటీర్లు బంద్‌కి వ్యతిరేకులయిన అనేక మంది ప్రజలకు తమ తమ విధులకు హాజరయేందుకు ఎన్నో విధాలుగా సహాయం చేశారని ఆయన అన్నారు. తాము స్వయంగా నగరమంతా పర్యటించి షాపులు తెరవడానికి నిరాకరించిన అనేక మందిని చంపక తప్పలేదని ఆయన అన్నారు. రాష్ట్ర గవర్నర్ శ్రీ బజోషి పక్షపాత వైఖరి అవలంబించి, కేంద్ర ప్రభుత్వంతో కుమ్మక్కయి తామే ఒక షాపు తెరచి సరకులు అమ్మారని, ఇది సహించరాని విషయమని రాష్ట్ర హోం శాఖ మంత్రి తమ ఆగ్రహాన్ని తెలియజేశారు. మొత్తం మీద బంద్ ప్రశాంతంగా జరిగిందని, చెదురుమదురు సంఘటనలు మినహా, అవాంఛనీయ సంఘటనలేమీ జరుగలేదని, అందువల్ల రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌కి కాబినెట్ మంత్రి హోదా కలుగజేస్తున్నామని రాష్ట్ర ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి శ్రీ నిరక్షరాస్యరావ్‌గారు మాట్లాడుతూ రాష్ట్రంలోని స్టూడెంట్స్ అందరూ బంద్‌లో పాల్గొన్నారని, ఈ రోజు రాష్ట్రంలోని కాలేజీలు, హైస్కూళ్లూ అన్నీ ఫర్నిచర్‌తో సహా తగలడిపోయి కూలిపోయినందున వారందరికీ కర్నాటక రాష్ట్రంలో విద్యా సంస్థలలో సీట్లు ఏర్పాటు చేయించి అక్కడే పరీక్షలు జరిపే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు.

ఇంక మేము వార్తలు వినలేదు.

మా పక్కనే కూర్చుని మా వంక ఆందోళనగా చూస్తోన్న మా కుటుంబ సభ్యులతో మాట్లాడడం ప్రారంభించాము.

వచ్చే వారం టెల్గూగన్

ముగ్గురు పంచ పాండవులు మూడు జగంబుల వన్నె కెక్కరే?

భారతదేశంలో వున్నా మరొక దేశంలో వున్నా భారత కథ చదివినా చదవక పోయినా పాండవులు ఐదుగురని తెలియని వారెవరూ వుండరు కదా! అయినా చదువుకున్న ఒక పృచ్ఛకుడు చదువురాని, భారతం తెలియని -వాడివలె తప్పుగా సమస్య ఇచ్చాడు. 'ముగ్గురు పంచపాండవులు ' అనే పదం చాలా అసంబద్ధంగా వుంది. 'ముగ్గురు పాండవులు' అన్నా ఏదో ఒక రకంగా పూరించే అవకాశం వుంది. అయినా అవధాన సరస్వతిగా పేరు పొందిన శ్రీ కావూరి పూర్ణచంద్రరావు గారు దీనిని ఎలా పూరించారో గమనించండి.

పూరణ

ఇగ్గురు మూర్తి తెచ్చిన అనిష్ట సమస్య మహత్తరంబునే
నుగ్గుల త్రావునాడె సమయోచిత రీతి గ్రహించి నాడనా
పగ్గె వెలార్చెదన్ కనుడు భత్యమతిన్ కవిరాజ ఇద్దరున్
ముగ్గురు పంచపాండవులు మూడు జగంబుల వన్నె కెక్కరే!

ఈ పృచ్ఛకుడు ఇచ్చింది నాకు నచ్చని సమస్య. ఇది చాలా విచిత్రమైంది. ఇటువంటి దానిని నేను నా చిన్న నాడే ఊహించి పూరించాను. నా ప్రజ్ఞ ఎలాటిదో చూపిస్తాను. శ్రద్ధగా గమనించవయ్యా పృచ్ఛకుడా! ఇద్దరు ప్లస్ ముగ్గురు (2+3-5) అయిన పంచ పాండవులు మూడు లోకాలలోను కీర్తి పొందారు కదా! అని దీని అర్థం. ఇటువంటివి చాలా చచ్చు సమస్యలయ్యా! నువ్వేదో గొప్పగా ఇచ్చాననుకుంటున్నావు. ఇలాటివాటిని నేను అవధానం చెయ్యడం ప్రారంభించిన తొలి నాళ్ళలోనే పూరించాను అని అవధాని పృచ్ఛకుడిని మెత్తగా చివాట్లు పెట్టి ముగ్గురు పంచపాండవుల లెక్క సరిపెట్టారు.

వచ్చేవారానికి సమస్య

ఎన్నిక కాని వారు ప్రజనేలుచునుండుట చిత్రమయ్యెడిన్

ఇది చాలా విచిత్రమైన సమస్య. ప్రజాస్వామ్య ప్రభుత్వంలో ప్రజలచేత ఎన్నుకోబడినవారు మాత్రమే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తారు కదా! రాజరిక వ్యవస్థ పద్ధతి ఇంకొక విధంగా వుండవచ్చు. ప్రజల నుండి ఓట్ల రూపంలో తమ ఎన్నిక జరగడం కోసమే కదా ఇటీవల పోటీ చేసిన అభ్యర్థులందరు ఓటరును 'మహారాజు'గా చూశారు. ఈ సమస్యని అవధాని ఎలా పూరించారో వచ్చేవారం గమనించండి.

— పి. జగన్నాథరావు

సారా వ్యాపారం చక్కాల క్రిందనలిగిన
'సారా' జీవితాల
చావా శివకోటి సీరియల్
అయ్యగారమ్మ అతి త్వరలో

29-12-89 ఆంధ్రజ్యోతి వచ్చే వారపత్రిక